జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | 11 | జులై | 2026 ◆ పేజీలు : 4



# దాసుతండాలో ఇంటింటా ఆనందం.. ఎమ్మెల్యే చేతుల మీదుగా గృహప్రవేశం

- పేదల ముఖాల్లో చిరునవ్వులు పూయిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు



**టేకులపల్లి,జూలై10,ప్రజాజ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తోందని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.శుక్రవారం టేకులపల్లి మండలం దాసుతండా గ్రామపంచాయతీ పరిధిలోని లచ్చతండా, సింగ్యతండా గ్రామాల్లో పర్యటించిన ఆయన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

మిగతా 2 లో...




2 లో..

- బతికున్న రైతును రికార్డుల్లో చంపేశారు..!
- నకిలీ మరణ ధ్రువీకరణతో “5 ఎకరాల భూమి కాజేత
- దమ్మపేటలో వెలుగు చూసిన రెవెన్యూ మాఫియా బాగోతం
- పంచాయతీ నుంచి నకిలీ డెత్ సర్టిఫికేట్..
- రెవెన్యూ కార్యాలయం నుంచి వారసత్వ పత్రం... ధరణిలో మ్యుటేషన్... చివరకు పాస్ బుక్ జారీ!
- బతికుండగానే 'చనిపోయిన వ్యక్తి'గా ప్రభుత్వ రికార్డుల్లో నమోదు...
- పెన్షన్, రైతు భరోసా నిలిపివేత... కార్యాలయంలో కన్నీటి పర్యంతమైన వృద్ధ రైతు
- తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధ రైతు హృదయవిదారక రోదన

# నేను బతికే ఉన్నా.. నన్ను చంపేశారు సార్...!

ప్రజల భూములను కాపాడాల్సిన రెవెన్యూ వ్యవస్థలోనే భారీ కుంభకోణం వెలుగుచూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో జరిగిన ఈ ఘటన ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. బతికుండగానే ఓ వృద్ధ రైతును అధికారిక రికార్డుల్లో చనిపోయిన వ్యక్తిగా చూపించి, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి, వారసత్వ పత్రం పొందించి, చివరకు ఐదు ఎకరాల అసైన్డ్ భూమిని ఇతరుల పేరుకు మార్చిన వ్యవహారం సంచలనం రేపుతోంది. ఈ మొత్తం ప్రక్రియలో గ్రామ పంచాయతీ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు పలువురు అధికారుల పాత్రపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / దమ్మపేట, ప్రజాజ్యోతి

# కవిత టూర్ లో శ్రేయస్ మీడియా ఎంట్రీ..?

- కవిత పర్యటన వేళ జిల్లాలో శ్రేయస్ మీడియా అధినేత మకాం
- రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చ




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జులై 10, ప్రజాజ్యోతి:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటిస్తున్నారు. ఇదే సమయంలో శ్రేయస్ మీడియా అధినేత జి. శ్రీనివాసరావు కూడా జిల్లాలో ఉండటం రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చకు దారితీసింది. సమాచారం ప్రకారం శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలో ఉన్నప్పటికీ, కవిత పాల్గొన్న బహిరంగ కార్యక్రమాల్లో ఆయన కనిపించలేదు. అయితే కవిత పర్యటన సమయంలోనే ఆయన జిల్లాలో ఉండటం ఆసక్తికరంగా మారింది. కవిత పర్యటనలో ప్రచార నిర్వహణ లేదా మీడియా సమన్వయానికి శ్రేయస్ మీడియాకు ఏమైనా సంబంధం ఉందా అనే చర్చలు వినిపిస్తున్నాయి. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం బయటకు రాలేదు. మరోవైపు కవిత పర్యటన పార్టీ ఆధ్వర్యంలోనే కొనసాగుతోందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శ్రేయస్ మీడియా ప్రతినిధులు గానీ, పార్టీ నాయకత్వం గానీ ఈ అంశంపై ఇప్పటివరకు స్పందించలేదు. దీంతో కవిత పర్యటనతో పాటు శ్రేయస్ మీడియా అధినేత మకాం జిల్లా రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ రెండు అంశాలకు సంబంధం ఉందని నిర్ధారించే అధికారిక ఆధారాలు ప్రస్తుతం లేవు.

# గాంధీనగర్ లో గుడుంబా పట్టివేత

- 18 లీటర్ల నాటు సారా స్వాధీనం
- నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- అదనపు సబ్ ఇన్స్పెక్టర్ నాగబిక్షం వెల్లడి



**బూర్గంపహాడ్, జూలై 10 (ప్రజా జ్యోతి):** మండలంలో ఎవరైనా నాటుసారా విక్రయిస్తే సహించేది లేదని చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని బూర్గంపహాడ్ అదనపు సబ్ ఇన్స్పెక్టర్ నాగ బిక్షం వెల్లడించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన సారపాక పట్టణంలోనీ గాంధీనగర్లో అనుమానస్పదంగా టాచ్చాడుతున్న

మిగతా 2 లో...

# అరుదైన ప్రసవం 5.5 కిలోల బాలుడు జననం



3 లో...

# ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించిన టేకులపల్లి బిడ్డ బానోత్ రవీందర్



**టేకులపల్లి, జూలై 10, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం 9వ మైలు తండాకు చెందిన బానోత్ రవీందర్ ప్రతిష్టాత్మక ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించి మండలానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చారు. సోనా, తులస్య దంపతుల కుమారుడైన రవీందర్ తన ప్రాథమిక విద్యను టేకులపల్లి ప్రభుత్వ పాఠశాలలో పూర్తి చేసి, అనంతరం ఖమ్మంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, సుజాతనగర్ లోని ధన్వంతరి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో బి.ఫార్మసీ పూర్తి చేశారు.2012లో హైదరాబాద్ లోని

మిగతా 2 లో...

## దాసుతండాలో ఇంటింటా ఆనందం..



(మొదటి పేజీ తరువాయి...)

శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.లచ్చతండాకు చెందిన ఇస్లావత్ కరుణ–బిచ్చు దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం సింగ్యతండాకు చెందిన నునావత్ లచ్చిరాం–మమత దంపతుల ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులను శాలువాలతో సన్మానించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ద్వారా న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక సర్పంచ్ భూక్యా చందర్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గాంధీనగర్ లో గుడుంబా పట్టివేత

(మొదటి పేజీ తరువాయి...)

ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా నాటు సారా విక్రయిస్తున్నట్లు తెలిపాడని, అతని వద్ద నుండి 18 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఏ ప్రాంతంలోనైనా ఎంతటి వారైనా గుడుంబా విక్రయిస్తే చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ మంగీలాల్ పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించిన టేకులపల్లి బిడ్డ బానోత్ రవీందర్




(మొదటి పేజీ తరువాయి...)

ప్రముఖ ఔషధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లో ఉద్యోగంలో చేరిన రవీందర్ గత 13 సంవత్సరాలుగా వైద్య రంగంలో సేవలందిస్తున్నారు. గుండె, మూత్రపిండాలు, మెదడు, మధుమేహం తదితర వ్యాధులకు సంబంధించిన వైద్య సేవల్లో ప్రముఖ వైద్యులతో కలిసి పనిచేస్తూ విశేష అనుభవాన్ని సొంతం చేసుకున్నారు.గత ఏడాది నవంబర్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు నిర్వహించిన ప్రత్యేక పెడియాట్రిక్ డెంటల్ హెల్త్ కార్యక్రమంలో ఆయన కీలక పాత్ర పోషించారు. కేవలం నాలుగు నెలల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 67,217 మంది చిన్నారులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించడంలో భాగస్వామిగా నిలిచారు.ఈ అసాధారణ సేవలకు గుర్తింపుగా ఆయనకు ప్రతిష్టాత్మక ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కేవలం ఐదుగురికి మాత్రమే ఈ గుర్తింపు దక్కగా, వారిలో రవీందర్ ఒకరు కావడం విశేషం.ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన విజయాన్ని తన తల్లిదండ్రుల కు, తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రమశిక్షణ,పట్టుదల తో శ్రమిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం సాధ్యమేనని ఆయన పేర్కొన్నా రు.రవీందర్ సాధించిన ఈ ఘనత పట్ల 9వ మైలు తండా గ్రామస్తులు, టేకులపల్లి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినంద నలు తెలిపారు.




- బతికున్న రైతును రికార్డుల్లో చంపేశారు..!
- నకిలీ మరణ ధ్రువీకరణతో “5 ఎకరాల భూమి కాజేత
- దమ్మపేటలో వెలుగు చూసిన రెవెన్యూ మాఫియా బాగోతం
- పంచాయతీ నుంచి నకిలీ డెత్ సర్టిఫికేట్..
- రెవెన్యూ కార్యాలయం నుంచి వారసత్వ పత్రం... ధరణిలో మ్యుటేషన్... చివరకు పాస్ బుక్ జారీ!
- బతికుండగానే 'చనిపోయిన వ్యక్తి'గా ప్రభుత్వ రికార్డుల్లో నమోదు...
- పెన్షన్, రైతు భరోసా నిలిపివేత... కార్యాలయంలో కన్నీటి పర్యంతమైన వృద్ధ రైతు
- తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధ రైతు హృదయవిదారక రోదన

# నేను బతికే ఉన్నా... నన్ను చంపేశారు సార్...!

**ప్రజల భూములను కాపాడాల్సిన రెవెన్యూ వ్యవస్థలోనే భారీ కుంభకోణం వెలుగుచూసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో జరిగిన ఈ ఘటన ప్రభుత్వ యంత్రాంగం పనితీరుపై తీవ్ర అనుమానాలకు తావిస్తోంది. బతికుండగానే ఓ వృద్ధ రైతును అధికారిక రికార్డుల్లో చనిపోయిన వ్యక్తిగా చూపించి, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి, వారసత్వ పత్రం పొందించి, చివరకు ఐదు ఎకరాల అసైన్డ్ భూమిని ఇతరుల పేరుకు మార్చిన వ్యవహారం సంచలనం రేపుతోంది. ఈ మొత్తం ప్రక్రియలో గ్రామ పంచాయతీ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు పలువురు అధికారుల పాత్రపై తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / దమ్మపేట, ప్రజాజ్యోతి

### ››› నకిలీ మరణ ధ్రువీకరణతో మొదలైన భూ దోపిడీ

పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన వృద్ధ రైతు మళ్ళా సత్యం పేరిట సర్వే నంబర్ 385/54లో ఐదు ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఎన్నో ఏళ్లుగా ఆ భూమినే సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న సత్యం భూమిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు, 2018 జూన్ 29న ఆయన మరణించినట్లు గ్రామ పంచాయతీ నుంచి నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

### ››› క్షేత్రస్థాయి విచారణే లేదు... అయినా వారసత్వ పత్రం జారీ!


మరణ ధ్రువీకరణ పత్రం ఆధారంగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో ఫ్యామిలీ మెంబర్ (వారసత్వ) సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేశారు. నిబంధనల ప్రకారం మండల గిరిద్వార్(ఆర్.ఐ ) ప్రత్యక్షంగా గ్రామానికి వెళ్లి విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఎలాంటి విచారణ లేకుండానే ఫైల్ ముందుకు వెళ్లిందని సమాచారం.మళ్ళా సత్యం భార్య పుల్లమ్మ మృతి చెందినట్లు, కుమార్తెగా నామా పుష్పావతి ఉన్నట్లు తప్పుడు వివరాలతో 2025 జూన్ 12న వారసత్వ ధ్రువీకరణ పత్రం జారీ అయినట్లు తెలుస్తోంది.

### ››› ధరణిలో మ్యుటేషన్... పాస్ బుక్ కూడా చేతిలో!

వారసత్వ పత్రాన్ని ఆధారంగా చేసుకుని నామా సత్యనారాయణ – పుష్పావతి దంపతులు 2026 మే 26న భూభారతి, ధరణి పోర్టల్ ద్వారా ఐదు ఎకరాల భూమిని తమ పేరుకు మ్యుటేషన్ చేయించుకుని, అధికారిక పట్టాదారు పాస్ బుక్ కూడా పొందినట్లు సమాచారం.

### ››› ఓటర్ల సర్వేలో బయటపడిన అసలు నిజం

ప్రభుత్వ రికార్డుల్లో చనిపోయిన వ్యక్తిగా నమోదవడంతో మళ్ళా సత్యంకు వస్తున్న ఆసరా పెన్షన్, రైతు భరోసా నిలిచిపోయాయి. తాజాగా ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా తన పేరు లేకపోవడంతో అనుమానం వచ్చిన సత్యం ఆరా తీయగా తన భూమి ఇతరుల పేరుకు మారిపోయిన విషయం తెలిసింది.వెంటనే తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న వృద్ధ రైతు..."నేను బతికుండగానే నన్ను చంపేశారు... నా పెన్షన్ తీసేశారు... రైతు భరోసా ఆపేశారు... ఇప్పుడు నా భూమినీ కాజేశారు... నాకు న్యాయం చేయండి సార్..."అంటూ కన్నీటి పర్యంతమవడంతో అక్కడున్న వారంతా చలించిపోయారు.




### ››› "జీపీవో ఫోర్జరీ చేసింది"... తహసీల్దార్ కొత్త వాదన

వ్యవహారం బయటపడటంతో తహసీల్దార్ కే రామ్ నరేష్ స్పందిస్తూ... తహసీల్దార్, ఆర్ ఐ సంతకాలను సంబంధిత జీపీవో ఫోర్జరీ చేశానని, కలెక్టర్ ఎదుట అంగీకరిస్తానని చెప్పిందని, అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఆమెపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

### ››› డిజిటల్ సైన్ ఎలా పడింది..?

'100 రోజుల ప్రజాపాలన' సమయంలో దరఖాస్తుల ఒత్తిడి కారణంగా తన ప్రమేయం లేకుండానే ఫైల్ పై డిజిటల్ సంతకం జరిగిందని తహసీల్దార్ వివరణ ఇవ్వడం కొత్త అనుమానాలకు దారితీసింది.బయోమెట్రిక్ లేకుండా డిజిటల్ సంతకం ఎలా జరిగింది?క్షేత్రస్థాయి విచారణ చేయాల్సిన ఆర్ ఐ ఎందుకు మౌనం వహించాడు?ఫైల్ ను ఎవరు ముందుకు పంపారు?అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

### ››› అసలు దోషులు ఎవరు..?

ఈ వ్యవహారంలో కేవలం కింది స్థాయి సిబ్బందిపై లేదా ప్రైవేట్ వ్యక్తులపై కేసులు నమోదు చేసి అసలు బాధ్యులను తప్పించే ప్రయత్నం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ నుంచి రెవెన్యూ కార్యాలయం వరకు మొత్తం వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు,రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి."బతికున్న రైతును చనిపోయిన వ్యక్తిగా చూపించి... ఐదు ఎకరాల భూమిని కాజేసిన ఈ వ్యవహారం దమ్మపేటలోనే కాదు... తెలంగాణ రెవెన్యూ వ్యవస్థలోనే సంచలనం రేపుతోంది. జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని నిష్పక్షపాత విచారణ జరిపితేనే అసలు నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు."

# అరుదైన ప్రసవం 5.5 కిలోల బాలుడు జననం

- డాక్టర్ .హారిక నేతృత్వంలో "బాల భీముడు" జననం





**చర్ల, జూలై 10(ప్రజా జ్యోతి ):** చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం చర్ల మండలంలోని కొయ్యూరుకు చెందిన గర్భిణికి 5.5 కిలోల బరువున్న మగ శిశువు నార్మల్ డెలివరీ ద్వారా జన్మించాడు. ఇంత ఎక్కువ బరువున్న శిశువు సాధారణ ప్రసవం ద్వారా జన్మించడం అత్యంత అరుదైన విషయమని వైద్యులు తెలిపారు.క్లిష్టమైన ఈ ప్రసవాన్ని చర్ల పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హారిక ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సులు సుశీల, ఉమారాణి సమర్థవంతంగా నిర్వహించి విజయవంతంగా పూర్తి చేశారు. ప్రసవ సమయంలో వైద్య బృందం తీసుకున్న ప్రత్యేక జాగ్రత్తలతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తల్లి, శిశువు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు.ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీధర్ చర్ల (కొయ్యురు) పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హారికను , వైద్య బృందాన్ని అభినందించారు. ఇంత క్లిష్టమైన ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని డాక్టర్ హారిక, స్టాఫ్ నర్సులు సుశీల, ఉమారాణి సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతంలోనూ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఇలాంటి అరుదైన ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించడం చర్ల పీహెచ్‌సీకి గర్వకారణమని ఆయన అన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ హారిక మాట్లాడుతూ ప్రతి గర్భిణికి సురక్షిత ప్రసవం అందించడమే తమ లక్ష్యమని గర్భిణీలకు గర్భధారణ కాలంలో క్రమం తప్పకుండా ఏఎన్‌సీ పరీక్షలు నిర్వహించడం అవసరమైన వైద్య సేవలు అందించడం నిరంతర పర్యవేక్షణ చేపట్టడం వల్లే విజయవంతమైన నార్మల్ డెలివరీలు సాధ్యమవుతున్నాయని తెలిపారు.ఈ విజయానికి గర్భిణీలపై ఏఎన్‌సీ ఫాలోఅప్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల ప్రత్యేక శ్రద్ధ, వైద్య సిబ్బంది సమిష్టి కృషి, నార్మల్ డెలివరీలను ప్రోత్సహించే వైద్య బృందం నిబద్ధతకు ప్రధాన కారణాలని అన్నారు.

## పాట రూపంలో నాగన్న బ్రతికే ఉంటాడు కోరం సీతారాములు

- జూలై 11న ఇల్లందులో జరిగే నాగన్న సంతాప సభను జయప్రదం చేయండి. న్యూ డెమోక్రసీ



**గుండాల జులై 10 ప్రజా జ్యోతి** నాగన్నకు మరణం ఉండదని పాట రూపంలో ప్రజల మధ్యనే ఉంటాడని న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కోరం సీతారాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో యాసారపు వెంకన్న అధ్యక్షతన జరిగిన నాగన్న సంతాప సభలో ఆయన మాట్లాడారు. నాగన్న చిన్ననాటి నుండే పాలేరుగా పనిచేస్తూ విప్లవ కమ్యూనిస్టు పార్టీల వైపు ఆకర్షితుడై ఆనాటి నుండి ప్రజల కోసం పేద ప్రజల విముక్తి కోసం పాటలు నాటికల రూపంలో ప్రజలను చైతన్యపరిచే వాడని అన్నారు. ఆనాటి నుండి పరకాల నాగన్న ను అరుణోదయ నాగన్న గా పిలుస్తూ ప్రజలలో మన్నలు పొందాడన్నారు నాగన్నకు పేద ప్రజల కోసం పనిచేయడం అంటే ప్రాణమని ఆ ప్రాణాన్ని పాట రూపంలో పయనం చేస్తూ పాటే ప్రాణంగా నిలబడి అనేక ఉద్యమాలలో అనేక పోరాటాలలో ముందుండి ప్రజలను చైతన్య పరుస్తూ ప్రజల కోసం పని చేశాడని పేర్కొన్నారు. నాగన్న పాటలు పాడడంతో పాటు నాటికలు రచించేవాడని, పాటలు సైతం రాస్తూ పాడేవారన్నారు . నాగన్న జీవితం అనేకమందికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈనెల 11న ఇల్లేందులో జరిగే నాగన్న సంతాప సభను జయప్రదం చేయాలని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని నాగన్న సంతాన సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఏఐకేఎంఎస్ మండల నాయకులు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఈశ్వర్, మోకాళ్ళ సూర్యనారాయణ, ఈసం కృష్ణ, శేఖర్, పార్టీ శేఖర్, ప్రమోద్ గడ్డం కృష్ణ, గుగ్గిల కృష్ణ, మెంతిని నగేష్, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా




**చర్ల, జూలై 10(ప్రజా జ్యోతి ):** ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నెలకు రూ.18 వేల వేతనం అమలు చేయాలని సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు కే. బ్రహ్మచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా కే. బ్రహ్మచారి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ.18 వేల వేతనం అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఆ హామీని అమలు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటిమీద రాతలుగా మారాయని అన్నారు.అంగన్వాడీ కేంద్రాల్లోనే ప్రీ-ప్రైమరీ విద్యను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, ఐసీడీఎస్‌కు తగిన నిధులు కేటాయించాలని, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు నాణ్యమైన యూనిఫాంలు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేసి, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు.అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే రానున్న రోజుల్లో నిరవధిక సమ్మెకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి, తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు స్వరూప, కృష్ణవేణి, రాణి, సావిత్రి, చిలకమ్మ, త్రివేణి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## సర్వీసు టీచర్లకు టెట్ తప్పనిసరి చేయొద్దు

- బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు




**చర్ల, జూలై 10(ప్రజా జ్యోతి ):** సర్వీసులో కొనసాగుతున్న ఉపాధ్యాయులకు టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) పరీక్ష నుంచి ప్రభుత్వం, న్యాయస్థానం మినహాయింపు కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అర్హత పరీక్షలు పూర్తి చేసి శిక్షణ పొంది డీఎస్సీ ద్వారా ఎంపికై అనేక సంవత్సరాలుగా సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను మరోసారి టెట్ పరీక్ష రాయాలని కోరడం సమంజసం కాదన్నారు. దీనివల్ల వేలాది మంది సర్వీసు ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు.గతంలో ఉపాధ్యాయ నియామకాల్లో ఇంటర్ అర్హత అనంతరం ఉపాధ్యాయ శిక్షణ, ఆ తర్వాత డీఎస్సీ పరీక్షల ద్వారా ఎంపిక జరిగేదని గుర్తు చేశారు. ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా పదోన్నతులు వార్షిక ఇంక్రిమెంట్ల కోసం శాఖాపరమైన పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ టెట్ పరీక్ష తప్పనిసరి చేయడం ఉపాధ్యాయులపై అదనపు భారం మోపినట్లేనని అన్నారు.ముఖ్యంగా పదవీ విరమణకు చేరువలో ఉన్న ఉపాధ్యాయులు, కుటుంబ బాధ్యతలు, పాఠశాల నిర్వహణ మధ్య మళ్లీ పరీక్షలకు సిద్ధం కావడం చాలా కష్టమని ఆయన అభిప్రాయపడ్డారు.టెట్‌ను పూర్తిగా రద్దు చేయాలని తాము కోరడం లేదని కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలో చేరే వారికి టెట్ కొనసాగించవచ్చని అయితే ఇప్పటికే సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు మాత్రం టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం, కోర్టు సానుకూలంగా స్పందించాలని దొడ్డి తాతారావు విజ్ఞప్తి చేశారు.

## ఈ బయ్యారం వర్తక సంఘం అధ్యక్షుడిగా సురేష్‌కు ఏడాది పూర్తి

- వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు
- ప్రతి ఒక్కరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్న అధ్యక్షుడు సురేష్



**పినపాక,జులై 10(ప్రజాజ్యోతి)** పినపాక మండలం ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లో వర్తక సంఘం అధ్యక్షుడిగా సురేష్, కమిటీ సభ్యులు బాధ్యతలు చేపట్టి ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్తక సంఘ సభ్యులు, వ్యాపారులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై అధ్యక్షుడు సురేష్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో వర్తక సంఘం అభివృద్ధికి సభ్యులంతా అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. వ్యాపారుల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ అధికారులతో సమన్వయం, వ్యాపారుల హక్కుల పరిరక్షణ, సామాజిక సేవా కార్యక్రమాల్లో వర్తక సంఘం చురుకుగా పాల్గొనడం వంటి అంశాల్లో అందరి సహకారంతో ముందుకు సాగగలిగామని తెలిపారు.వ్యాపారుల ఐక్యతే సంఘానికి బలమని అన్నారు.భవిష్యత్తులో కూడా సంఘాన్ని మరింత బలోపేతం చేసి వ్యాపారుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి వ్యాపారి సమస్యను సంఘం సమస్యగానే భావించి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.అనంతరం పలువురు వర్తక సంఘ సభ్యులు మాట్లాడుతూ, అధ్యక్షుడు సురేష్ నాయకత్వంలో సంఘం మరింత చురుకుగా పనిచేస్తోందని కొనియాడారు. వ్యాపారుల మధ్య ఐక్యత పెంపొందించడం, అవసరమైన సందర్భాల్లో వారికి అండగా నిలవడం వంటి కార్యక్రమాల్లో ఆయన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు.ఈ వేడుకల్లో సంఘ సభ్యులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు, వర్తకులు పాల్గొన్నారు

## ఉద్యమకారుల కేకే కమిటీ సమావేశంలో పాల్గొన్న బూర్గంపాడు ఉద్యమకారులు



**బూర్గంపహాడ్,జూలై 10(ప్రజా జ్యోతి ):** హైదరాబాదులో తెలంగాణ అమరవీరుల స్మారక స్థూపం వద్ద నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల కేకే కమిటీ సమావేశంలో శుక్రవారం బూర్గంపహాడ్ ఉద్యమ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్ ఇవ్వాలని కమిటీని కోరారు. అదేవిధంగా ఉద్యమంలో ఎవరైతే పాల్గొన్నారో కమిటీ వారు గుర్తించి వారికి అనేక సంక్షేమ పథకాలు అందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తోడేటి సత్యనారాయణ, మరి సాంబా రెడ్డి, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్లుగా పెండింగ్ డిమాండ్లు..

- ప్రభుత్వ స్పందన కోసం అంగన్వాడీల ఎదురుచూపు



**టేకులపల్లి,జూలై 10,ప్రజాజ్యోతి:** అంగన్వాడీల ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా టేకులపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. సీడీపీఓ అందుబాటులో లేకపోవడం తో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ పాయం సారమ్మ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్సీ) సిఫార్సుల మేరకు వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, పదవీ విరమణ చేసిన వారికి నెలకు రూ.18 వేల పెన్షన్ ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, బీఎల్ఓ, ఎఫ్ఆర్ఎస్, ఎస్ఐఆర్ విధులను రద్దు చేయాలని, ఐసీడీఎస్‌కు కేంద్ర ప్రభు త్వం తగిన నిధులు కేటాయించి వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. ఈకార్యక్రమం లో రాణి, కే.మంజుల,పీ. విజయ, ఏ. రాధ, నాగమణి, శారద, నీలిమ, పద్మ తదితర అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## మొహరం సందర్భంగా పీరీల చావడి వద్ద అన్నదాన కార్యక్రమం





**టేకులపల్లి, జూలై 10, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని మూడు తండ గ్రామంలో మొహరం పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పీరీల చావడి వద్ద భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీరీల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నకోయగూడెం మాజీ సర్పంచ్ కోరం ఉమా, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు, సుఖాలబోడు సర్పంచ్ రామ భక్తులకు, గ్రామ ప్రజలకు అన్నదానం చేసి భోజనం వడ్డించారు.ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పీరీల చావడిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తాగునీరు, భోజనం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మొహరం పండుగ మత సామ రస్యం,సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు.అన్నదాన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మొహరం వేడుకలు ప్రశాంత వాతావరణం లోనిర్వహించబడగా,పరస్పర ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని చాటేలా గ్రామస్తులు పాల్గొన్నారు.

# బిల్లుడుతండాల్లో కాంగ్రెస్ గ్రామశాఖ కమిటీల ఎన్నికలు

- గ్రామస్థాయి నుంచే పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- కోరం సురేందర్





**టేకులపల్లి,జూలై 10,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని చింతలంక, బిల్లుడుతండా గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన కమిటీల ఎన్నికలు శుక్రవారం ఉత్సాహభరితంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలకు చింతలంక సర్పంచ్ కంగాల లక్ష్మి , బిల్లుడుతండా సర్పంచ్ బానోత్ లక్ష్మి – మంగ్యా నాయక్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోరం సురేందర్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు కాంగ్రెస్ కండువాలు కప్పి అభినందనలు తెలిపారు. గ్రామ స్థాయి నుంచే పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.చింతలంక గ్రామశాఖ అధ్యక్షుడిగా భూక్యా పవన్, బిల్లుడు తండా గ్రామశాఖ అధ్యక్షుడిగా బానోత్ జగ్య ఎన్నికయ్యారు. ఇరు గ్రామాలకు చెందిన ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కోశాధికారులు, ప్రచార కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, మండల కాంగ్రెస్ నాయకులు ఈది గణేష్, నవీన్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజలకు చేరువ కావాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని ఆకాంక్షించారు.

## వర్షాకాల వ్యాధుల నివారణకు మర్కోడులో దోమల మందు పిచికారి

- గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా సర్పంచ్, ఉపసర్పంచ్ పర్యవేక్షణలో ప్రత్యేక చర్యలు



**ఆళ్లపల్లి,జూలై10(ప్రజా జ్యోతి)** వర్షాకాలంలో దోమల బెడద పెరుగుతున్న నేపథ్యంలో గ్రామ ప్రజలను డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా కాపాడేందుకు ఆళ్ళపల్లి మండలం మర్కోడు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సుతారి రమాదేవి, ఉపసర్పంచ్ వగలబోయిన సతీష్ స్వయంగా గ్రామంలోని ప్రతి వీధిని పరిశీలిస్తూ దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామంలో పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు గ్రామపంచాయతీ నిరంతరం కృషి చేస్తుందని, అవసరమైన పారిశుద్ధ్య చర్యలు కొనసాగిస్తామని సర్పంచ్. ఉపసర్పంచ్ తెలిపారు.

## విద్యాసంస్థల బంద్ విజయవంతం

- విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్



**ఆళ్ళపల్లి.జూలై10(ప్రజా జ్యోతి)** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌లో భాగంగా ఆళ్ళపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో బంద్ విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల కార్యదర్శి తాళ్లపల్లి వినయ్ మాట్లాడుతూ రాష్ట్రానికి వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను క్లస్టర్లుగా కుదించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని,లేనిపక్షంలో విద్యార్థి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్కే అరిఫ్, మహేష్ తదితర విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్పీ రోహిత్ రాజుకు బంజారా సంఘాల జేఏసీ కృతజ్ఞతలు



**కొత్తగూడెం, జులై 10, ప్రజా జ్యోతి:** గిరిజన పూజారి భూక్య మంగీలాల్ పై జరిగిన దాడి ఘటనలో కానిస్టేబుల్ పై చర్యలు తీసుకున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు బంజారా సంఘాల జేఏసీ చైర్మన్ బానోత్ వీరు నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, బాధితుడి ఫిర్యాదుపై ఎస్పీ వెంటనే స్పందించి నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేయించినట్లు తెలిపారు. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారని చెప్పారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ కార్యదర్శి ధరావత్ కాన్షిరాం, భూక్య మంగీలాల్, కట్రం మోహన్ రావు, అశోక్, వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.